

శిశుగృహంలో చిన్నారి మృతి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
సిబ్బంది నిర్లక్ష్యం కారణమంటూ ఆరోపణలు ?
విచారణకు ఆదేశించిన కలెక్టరు ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని శిశుగృహంలో నెలల బాలుడు మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. అక్కడ పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే మగ శిశువు మృతి చెందినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై కలెక్టర్ ఆనంద్ సమగ్రమైన విచారణకు త్రిమెన్ కమిటీని వేశారు. దీనికి సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగా ఉన్నాయి.. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఒక మహిళ తనకు పుట్టిన మగబిడ్డ బాగోగులను పేదరికం కారణంతో చూసుకోలేమంటూ ఆగస్టు 30వ తేదీన శిశుగృహంలో వదిలి వెళ్లింది.అప్పటి నుంచి అక్కడే సిబ్బంది పిల్లాడి బాగోగులు చేసుకుంటున్నారు. అయితే అక్కడ పనిచేసే ఆయాలు ఇద్దరు పరస్పరం గొడవ పడి పిల్లావాడు ఏడుస్తున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఎక్కువగా ఏడవటం వలన అనారోగ్యం గురైన ఆ బాలుడు సెప్టెంబర్ 30వ తేదీన మృతిచెందాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా బాలుడి మృతదేహాన్ని పూడ్చేసినట్లు సమాచారం. అయితే ఐసిడిఎస్, శిశుగృహం అధికారులు మాత్రం అనారోగ్యంతోనే బాలుడు చనిపోయినట్లు చెబుతున్నారు. ఈవిషయం బయటకు పొక్కడంతో కలెక్టర్ స్పందించారు. వెంటనే విచారణకు త్రీమెన్ కమిటీని వేశారు.

ఆసుపత్రికి తరలించేలోపు బాలుడు మృతిచెందాడు : దీప్తి , శిశుగృహం మేనేజర్

చనిపోయిన మగ శిశువు ఆగస్టు 30వ తేదీన తమ వద్ద వదిలివెళ్లారు. అప్పుడు తక్కువ బరువుతో బాలుడు ఉన్నాడు. 1.75 కిలోలు మాత్రమే ఉండే బాలుడు 2.05 కిలోలు అయ్యాడు. సరిగా చూసుకోకపోవడం వల్లనే బాలుడు మృతిచెందాడన్నది నిజం కాదు. పిల్లాడి ఆరోగ్యం బాగోలేదనిశిశువును అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలోనే చనిపోయడు. గుండె ఆగి చనిపోయినట్లు వైద్యులు చెప్పారు.

ఆరోగ్యం బాగోలేక చనిపోయినట్టు చెప్పారు : నాగమణి , ఐసిడిఎస్ పిడి

శిశువుకు శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయి ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు చనిపోయినట్టు తమకు సమాచారం అందింది. శిశువును ఖననం కూడా చేసినట్టు సమాచారమిచ్చారు. అయితే ఇప్పుడు ఆయాలు సరిగా చూసుకోకపోవడం వలన మరణించినట్టు వస్తున్న ఆరోపణలపై విచారిస్తాం.

శిశువు మరణం బాధాకరం.. విచారణకు ఆదేశం : కలెక్టరు ఆనంద్

శిశుగృహంలో రెండు నెలల బాలుడు చనిపోవడం అత్యంత బాధాకరం. ఈ ఘటనపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణకు ఆదేశిస్తున్నాం. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఈబి.దేవి, ఐసిడిఎస్ పిడి నాగమణి, ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవికుమార్‌లతో కలిపి త్రిసభ్య కమిటీని వేశాం. ఈ కమిటీ శిశుగృహ ఘటనలో పూర్తి స్థాయి విచారణ అనంతరం ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

విచారణ ప్రారంభించిన అధికారులు :అనంతపురంలోని శిశు గృహంలో పసికందు ఆకలితో మృత్యువాత ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో డిఎంహెచ్ఒ ఈబీదేవి, ఐసిడిఎస్ పీడీ నాగమణి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు రవికుమార్‌ను నియమించారు. అయితే చిన్న పిల్లల వైద్య నిపుణుడు విచారణకు రాలేదు. డిఎంహెచ్ఒ ఈబీదేవి, ఐసిడిఎస్ పీడీ నాగమణి విచారణ ప్రారంభించారు. శిశు గృహంలో పనిచేస్తున్న మేనేజర్ దీప్తితోపాటు మరో ఐదుగురి సిబ్బందిని విచారిస్తున్నారు. పసికందు మృత్యువాత పడిన రోజు ఏమి జరిగింది.. ఎవరెవరు విధుల్లో ఉన్నారు.. అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి నివేదికను తయారుచేసి జిల్లా కలెక్టర్ కు అందిస్తామని డిఎంహెచ్, ఐసిడిఎస్ పీడీ తెలిపారు.

ఒక ఇల్లూ కట్టలేదు..



కొటిపి వద్ద పునాదులకే పరిమితమైన పేదల ఇంటి నిర్మాణాలు

ఏడాది దాటిన కూటమి పాలన
గృహాల కోసం వేలల్లో దరఖాస్తులు
టిడ్కో గృహాల సంగతేంటి...?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయింది. అయినా ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కనీసం ఇంటి స్థలాలను సైతం కేటాయించలేదు. ఇక 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మాణం చేసిన టిడ్కో గృహాలను సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో పేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది. నిరు పేదలు సొంతింటి కోసం దరఖాస్తులు చేసుకొన్నా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో భూ స్వాధీన పోరాటాలు చేస్తున్నారు. వారు అక్కడ ఏర్పాటు చేసుకున్న నివాసగృహాలకు సైతం పట్టాలు ఇవ్వటం లేదు. దీన్ని బట్టి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేలకు పేదలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుంది.

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ సామాన్య ప్రజానీకం సొంతింటి కలకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు వేయని పరిస్థితి. దీంతో ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ శ్రీ సత్య సాయి జిల్లాలో సుమారు 22.540, అనంతపురం జిల్లాలో సుమారు 30.800 మంది పేదలు ఇంటి స్థలం, నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండాపోయింది. దీంతో దరఖాస్తులన్నీ అలానే ఉండిపోయాయి. కొత్త ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తామని చెప్పడం తప్ప ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు ప్రక్రియ లేకుండాపోయింది. దీంతో ఎంతోమంది సామాన్య ప్రజానీకం ఇంటి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకుని ఇంకా నిరీక్షించలేక అప్పు తెచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. గడిచిన పదేళ్ల నుంచి ఇప్పటి వరకూ హిందూపురం పట్టణ సమీపంలోని కొటిపి వద్ద వేసిన లే అవుట్‌లో ఒక్క ఇల్లు నిర్మాణం జరగ లేదు. గత ప్రభుత్వం పునాదులు వేసింది. నిర్మాణం చేపట్టలేదు. 2014-19 మధ్యలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో 2018లో టిడ్కో గృహాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే బాలయ్య పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా లబ్దిదారులకు కేటాయించ లేదు.

ఒక్క స్థలమూ ఇవ్వలేదు

గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించడంతో పాటు మేనిఫెస్టోలోనూ పెట్టారు. అధికారంలోకొచ్చి 14 నెలలు గడిచినా ఇప్పటి వరకూ ఒక్క స్థలమూ ఇవ్వలేదు. ఇంటి స్థలాలకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో లెక్కలు కూడా చెప్పడం లేదు. బడా బాబులకు రూ.1 రూపాయికి ఒక ఎకర భూమి కేటాయించడానికి చూపిస్తున్న శ్రద్ధ పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయింపునకు చూపించడం లేదు. భూసేకరణ చేసి ఇంటిస్థలం ఇస్తామని చెబుతూ కాలక్షేపం చేస్తున్నారు. దీంతో ఇంటిస్థలం సామాన్యులకు దక్కుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇళ్ల నిర్మాణం, ఇంటి స్థలాలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

టిడ్కో గృహాల సంగతేంటి....?

హిందూపురం పట్టణంలో గత 17 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు.ఉండడానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయాల అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు.2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కొటిపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులను 2018 జనవరి 10న ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. ఆ సమయంలో మొదటి దశ కింద 2050 ఇళ్లు, రెండవ దశ కింద 6500 ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రణళికలను సిద్ధం చేశారు. అందరికీ ఇళ్లు పథకం కింద టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు సంయుక్తంగా జీ ప్లస్-3 తరహాలో అపార్టుమెంట్ల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్దిదారుని వాటాతో ఇళ్లు నిర్మించ తలపెట్టారు. 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు పనులు మొదలు పెట్టారు. ఆ సమయంలో లబ్దిదారులు ముందుకు రాక పోవడంతో అప్పటి పాలక వర్గం ప్రజలకు అవగాహన కల్పించి డిడిలు చెల్లించే విధంగా చూడడంతో కొంత మంది ముందుకు వచ్చి డిడిలు చెల్లించారు.క్యాటగిరిల వారీగా మొత్తం 2736 మంది డిడిలు చెల్లించారు. ఇందులో 2516 మందికి ఇళ్లను కేటాయించారు. బ్యాంకు లింకేజీ క్రింద లబ్దిదారుల వాటాకు రుణాలను ఇప్పించడానికి మెప్మా వారికి అప్పగించడంతో 380 మందికి వివిధ బ్యాంకుల్లో రుణాలు ఇప్పించారు. అయితే ఇప్పటిదాకా ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, లబ్దిదారులకు కేటాయించ లేదు. అయితే బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రం ఇఎంఐ చెల్లించాలని కొంత మందికి బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బాలయ్య టిడ్కో గృహాలను సందర్శించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో ఆరు నెలల్లో పనులను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేస్తామని ఆ నాడు అన్నారు. అయితే 14 నెలలు పూర్తి అవుతున్నప్పటికి దాని గురించి బాలయ్య కాదు కదా ఆయన పిఎలు సైతం ప్రస్తావించకపోవడం చూస్తుంటే టిడ్కో గృహాల కథ కంచికి చేరినట్లు అనిపిస్తోంది.

భళా గోపాల్‌రెడ్డి...

ఎద్దు కళ్లకు గంతలు కట్టి విత్తనం వేసిన రైతు
9 గంటల్లో 10 ఎకరాల పొలంలో పప్పుశనగ విత్తనం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలకేంద్రానికి చెందిన గోపాల్‌రెడ్డి అనే రైతు ఎద్దు కళ్లకు గంతలు కట్టి 9 గంటల సమయంలో 10 ఎకరాల పొలంలో పప్పుశనగ విత్తనం విత్తాడు. ఈ దృశ్యాన్ని చూసేందుకు ఆత్మకూరు, కూడేరు, కళ్యాణదుర్గం మండలాలకు చెందిన వివిధ గ్రామాల రైతులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ తతంగం సినిమా షూటింగ్‌ను తలపించింది. మండలకేంద్రానికి చెందిన దుబ్బ గోపాల్‌రెడ్డి అనే రైతు తన ఎద్దు కళ్లకు గంతలు కట్టి అదే గ్రామానికి చెందిన పాలెం వెంకటనారాయణరెడ్డి అనే రైతుకు చెందిన నల్లరేగడి భూమిలో పప్పుశనగ విత్తనాన్ని విత్తాడు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 3 గంటల వరకు అంటే 9 గంటల సమయంలో 10 ఎకరాల విస్తీర్ణంలో పప్పుశనగ విత్తనాన్ని విత్తాడు. ఈసందర్భంగా గోపాల్‌రెడ్డిని పలువురు రైతులు అభినందించారు.



ఎద్దు కళ్లకు గంతలు కట్టి విత్తనం వేస్తున్న రైతు

సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకం

డిఇఒ ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్ది సమాజ అభివృద్ధితో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు కొనియాడారు. నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించడం కోసమే ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకున్నట్లు తెలిపారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతరంపైనే ఆధారపడి ఉంటుందని, అలాంటి విద్యార్థులు, యువతలో మంచి ఆలోచనలు, దేశభక్తి, సమాజం, పెద్దలపై గౌరవం, అంకిత భావాలను పెంపొందించడంలో గురువులదే కీలకపాత్ర అన్నారు. తరగతి గదిలో శిష్యులకు చదువుతోపాటు విలువలు, జ్ఞానంతో కూడిన జీవిత నైపుణ్యాలను బోధిస్తారని చెప్పారు. భవిష్యత్తు తరాలను అభివృద్ధి చేయడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పిఎస్ హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రముఖ కవి గోసల నారాయణస్వామి, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు నాగభూషణం, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు, ప్రముఖ ఆర్థికవేత్త గొర్తి వెంకటస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

6న 'స్వచ్ఛాంధ్ర' అవార్డుల ప్రదానోత్సవం

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 6వ తేదీన స్వచ్ఛాంధ్ర అవార్డులు - 2025 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ శాఖ అధికారి (డిపిఒ) నాగరాజు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. కావున జిల్లాస్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులు పొందినవారు పాల్గొని అవార్డులను స్వీకరించాలని కోరారు.

ఫ్యాప్టో పోరుబాటకు ఆర్ఇఎఫ్ మద్దతు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో చేపట్టిన పోరుబాట నిరసనకు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.నారాయణనాయక్ తెలిపారు. ఆదివారం ఆ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విన్నవిస్తున్న స్పందన లేకుండా ఉందన్నారు. ఒత్తిడి పెంచడానికి చేస్తున్న పోరుబాటకు ఆర్ఇఎఫ్ మద్దతు ఇస్తూ ప్రత్యక్షంగా పాల్గొంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ జాతీయ కన్వీనర్ జి.నాగభూషణం, రాష్ట్ర కోకన్వీనర్లు జి.శ్రీనివాసులు, మావిటి శ్రీరాములు, డ్వామా లక్ష్మీనారాయణ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్.మహేష్ నాయక్, హేమంత్, సాయినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గురువులను గౌరవిద్దాం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసే గురువులను గౌరవించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ తెలిపారు. జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంగమేష్ నగర్‌లోని జెవివి కార్యాలయంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్షులు కెపి.చిత్తప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్య వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) అక్టోబర్ 5 ను ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా పేర్కొందన్నారు. 1994 నుంచి క్రమం తప్పకుండా ఈ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల్లో జరుగుతుందన్నారు. విద్యలో పరివర్తన ఉపాధ్యాయులతో ప్రారంభమవుతుందనే విషయాన్ని యునెస్కో తెలిపిందన్నారు. జ్ఞానమందించి, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేసే కృషి వెలకట్టలేనిదన్నారు. అయితే ప్రస్తుతం ఉపాధ్యాయులను గౌరవించే తీరు మారుతోందన్నారు. ఇది మంచి పరిణామం కాదని ఆ వత్తికి గౌరవం ఇవ్వాల్సిందేనని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. జెవివి జిల్లా నాయకులు అర్జున్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులను విద్యా బోధనకు కాకుండా ఇతర పనులకు కేటాయించడం ఎక్కువ అవుతోందన్నారు. దీని వల్ల విద్యార్థులకు సరైన న్యాయం జరగడంలేదన్నారు. విద్యార్థులను భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎక్కువ సమయం బోధనలోనే కృషి జరగాలని అలా జరగకపోతే సమాజానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు ఎస్ఎం.బాషా, జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.ప్రసూన, ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, నాయకులు కెంచా.లక్ష్మీనారాయణ, నాగరత్న, శ్రీనివాసరావు, గాంగేనాయక్, రామచంద్రుడు, తిరుపాలు, రామిరెడ్డి, రామకృష్ణ, రాఘవేంద్ర, ప్రసాద్ రెడ్డి, ముత్యాలు, మారెన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

సహకార పరపతి సంఘాల జిల్లా అధికారి ఆర్. కృష్ణా నాయక్



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని సహకార పరపతి సంఘాల జిల్లా అధికారి ఆర్. కృష్ణానాయక్ తెలిపారు. రైతుల కోసమే ప్రత్యేకంగా ప్రభుత్వం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటు చేసింది. ఈ సంఘాల ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, ప్రాథమికంగా ఆయా గ్రామాలలో అందించాలన్న లక్ష్యంతో ఈ సంఘాల ఏర్పాటుకు అంకురార్పణం జరిగింది. రైతులు ఎన్నుకున్న పాలకవర్గం ద్వారా ఈ సంఘాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా రైతులు పంటలు పెట్టే సమయంలో బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకోకుండా తక్కువ వడ్డీతో రుణాలు తీసుకునే వెసులుబాటు ఈ సంఘాల్లో కల్పించారు. సహకార పరపతి సంఘాలు మరింత బలపడే విధంగా ప్రభుత్వం వినూత్నంగా కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగానే రుణాలతో పాటు అవసరమైన ఎరువులు రైతులకు అందిస్తోంది. ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల ద్వారా ఆహార భద్రత కల్పించడానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం కోసం ధాన్యం సేకరణ చేపడుతున్నాయి. అలాగే వరి, కందులు ప్రాసెసింగ్ యూనిట్లు ఉమ్మడి వ్యాపారాల స్థాపన ఆయా సంఘాల రైతుల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్) ద్వారా రైతులకు అందుతున్న సదుపాయాల గురించి జిల్లా సహకార పరపతి సంఘాల శాఖ అధికారి ఆర్. కృష్ణా నాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి? అందులో ఎన్ని సంఘాలలో ఎరువుల పంపిణీ జరుగుతోంది?

జవాబు: జిల్లాలో మొత్తం 54 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్) ఉన్నాయి. ఎరువుల పంపిణీ కోసం లైసెన్స్ లేని సంఘాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు లైసెన్స్ కోసం దరఖాస్తులు చేయించడం జరుగుతోంది. ఇందులో ఇప్పటివరకు 35 సంఘాలకు లైసెన్సు మంజూరైంది. 29 మంది సిబ్బందికి శిక్షణ ఇప్పించడం జరిగింది. ప్రస్తుతం 15 సంఘాల్లో ఎరువుల పంపిణీ జరిగింది. మరో 20 రోజులలో రబీ సీజన్ కు అవసరమైన ఎరువులు అన్ని ఆయా సంఘాలకు సరఫరా చేయడం జరుగుతుంది.

ప్ర: రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలు వివరించండి?


జ: ఈ సహకార సంఘాలలో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈ కేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేయిస్తున్నాము. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందుతాయి. వ్యక్తిగతంగా ఆయా వ్యవసాయ రంగాల అభివృద్ధికి బ్యాంకులు రైతులకు రుణాలు అందిస్తాయి. ఉమ్మడి వ్యాపారాలు చేపట్టే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతోంది. ఉమ్మడిగా ఎరువులు అమ్మడం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశువులు, ట్రాక్టర్లు, గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంపకం, తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకొని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాము.

ప్ర: రైతులు ఉమ్మడి వ్యాపారాల నిర్వహణకు విధి విధానాలు ఏమిటి?

జ: సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో 25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలన్నీ కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలో మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణ కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీని కూడా రైతులు పొందే అవకాశం ఉంది.

ప్ర : ఆహార భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: సహకార సంఘాల ద్వారా రైతులకు యూనిట్ల ద్వారా ఆహార పదార్థాలను నిలువ చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మన జిల్లాలో గూనిపల్లి, రామగిరి, గోడ్లూరు, కొండూరు, పిఎసిఎస్‌లలో వరి ప్రాసెసింగ్ యూనిట్లు, అలాగే ముదిగుబ్బ, మడకశిర, తదితర సంఘాలలో కందుల ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడం జరిగింది. అలాగే కొత్త యూనిట్లకు ప్రతిపాదనలు పంపాము. జిల్లాలో 27 ధాన్య నిలువల కోసం గోదాముల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదించాము. 2024-25 సంవత్సరంలో 8 ప్రాథమిక సంఘాల ద్వారా 118.400 మెట్రిక్ టన్నుల రాగి సేకరణ చేయడం జరిగింది. వీటి ధర రూ. 80,82,360 ఉంటుంది. అలాగే రెండు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో 98.9 మెట్రిక్ టన్నుల కందులు సేకరించగా వాటి ధర రూ. 67,11,950 రూపాయలుగా ఉంది.



సహకారపరపతిసంఘాల జిల్లా అధికారి ఆర్. కృష్ణానాయక్

ప్ర : రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ: ఉమ్మడిగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు సంఘాల ద్వారా నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంటుంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకుంటే అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. అందుకు రైతులు సహకరించాలి. వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులకు మేలైన సేవలు అందించడానికి ఈ సంఘాలు ఉన్నాయి.

'కంది'పోతోంది



పంటను నాశనం చేస్తున్న శనగ పచ్చపురుగు కాపాడుకునేందుకు అన్నదాతల అష్టకష్టాలు



కందిపంటకు మందుపిచికారి చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్‌లో) పురుగు తొలచిన కందికాయ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

దశాబ్ధాలుగా వేరుశెనగ పంట సాగు చేస్తూ ప్రతిఏటా నష్టాలు చవిచూసిన రైతులు రెండేళ్లుగా కందిపంట వైపు మొగ్గుచూపుతున్నారు. ఇందులో భాగంగానే గతేడాది ఖరీఫ్‌లో వర్షాధారంపై కంది సాగుచేసిన రైతులు బాగానే దిగుబడులు పొందడంతోపాటు ధరలు కూడా అనుకూలంగా ఉండటంతో లాభాలు గడించారు. దీంతో ఈఏడాది అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్లలోనూ కందిపంట సాగు పెరిగింది. ప్రధానంగా నాలుగు డివిజన్లలో అత్యధికంగా సాగు చేశారు. అయితే కంది పంటను ఆశిస్తున్న తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం కంది సాగు చేసి వందరోజులు దాటింది. పూత, కాయదశలో ఉంది. ఈనేపథ్యంలో పంటకు తెగుళ్ల బెడద అధికమైంది. ప్రధానంగా శనగ పచ్చపురుగు భారీగా పంటను నాశనం చేస్తోంది. దీంతో రైతులు పంటను కాపాడుకునేందుకు మందులు పిచికారి చేస్తున్నారు. పంటసాగు సమయంలో సేద్యాలు, మందులు, విత్తనాలు, కలుపులు, ఖర్చులు భారీగానే పెట్టుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం శెనగ పచ్చపురుగును నియంత్రించడానికి క్రిమి సంహారక మందులకు రూ.వేలు ఖర్చు చేయాలి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కందిసాగును పరిశీలిస్తే..

డివిజన్ పేరు	హెక్టార్లలో
కళ్యాణదుర్గం	21637
రాయదుర్గం	9049
ఉరవకొండ	40875
గుత్తి	8400

పెట్టుబడులను పరిశీలిస్తే..

నాలుగెకరాల్లో కంది పంట సాగు చేయాలంటే సేద్యాల ఖర్చులు ముందుగానే రూ.10వేలు దాటుతుంది. ఇక విత్తనం ఖర్చులు రూ.4వేలు, విత్తన సాగుకు ఖర్చులు మరో రూ.3వేలు అవుతుంది. ఎరువులు వేయడానికి రూ.4వేలు, ప్రస్తుతం తెగుళ్లను నియంత్రించేందుకు ఒకసారి క్రిమిసంహారకమందు పిచికారి చేస్తే మందుల ఖర్చులు రూ.2వేలు, స్ప్రేయింగ్ ఖర్చు రూ.వెయ్యి భరించాలి. ఒకసారితో పిచికారి చేస్తే తెగుళ్లను నియంత్రించడం సాధ్యమయ్యే పనికాదు. ఇప్పటికే రెండుసార్లకుపైగా మందులు పిచికారీ చేశారు. ఈ లెక్కన రెండుసార్లకు నాలుగెకరాల కందిలో తెగుళ్ల నియంత్రణ ఖర్చు రూ.6వేలకుపైగానే భారం పడుతోంది. ప్రస్తుతం పూత, కాయదశలో ఉన్న కందికి శనగపచ్చపురుగు భారీగా ఆశించింది. కాయదశలో ఏర్పడిన కందికాయలను శనగ పచ్చపురుగు తొలిచివేస్తోంది. దీంతో కందిపంట దిగుబడి కోల్పోయే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కందిపంట తొలగించేలోగా మరో మూడుసార్లు మందులు పిచికారిచేయాల్సిన పరిస్థితి. ఈలెక్కన్న నాలుగెకరాల్లో పంట సాగు చేస్తే సుమారు రూ.20వేలకు పైగానే భారం పడుతోంది.

తెగుళ్లతో నష్టపోతున్నాం



కందిపంటకు తెగుళ్ల సోడంతో నష్టపోతున్నాం. మందులు పిచికారీ చేసినా పచ్చపురుగు ఉధృతి తగ్గడం లేదు. తాను సొంతపొలం ఐదెకరాలు, కౌలుకు మరో 15 ఎకరాలు తీసుకుని కందిపంట సాగు చేశా. ఇప్పటికే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టా. తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు రూ.వేలు ఖర్చు చేస్తున్నా. ఒక్కోసారి మందులు పిచికారీ చేయాలంటే రూ.20వేలు ఖర్చు అవుతోంది. తెగుళ్ల తగ్గకపోతే నష్టం తప్పదు.

వడ్డే వెంకటేశులు, రైతు, పిటిఆర్‌పల్లి

దశలవారీగా మందులు పిచికారి చేయాలి



ప్రస్తుతం కందిపంట సాగుచేసి 110 రోజులు అవుతోంది. పూత, కాయదశలో కంది పంట ఉంది. కందిలో శనగ పచ్చపురుగు కనిపిస్తోంది. దశలవారీగా మందులు పిచికారీ చేసుకోవాలి. నాలుగు దశల్లో మందులు పిచికారి చేసుకుంటే మంచిది. మొదటిదశలో వేపనూనె లీటర్ నీటిలో 10ఎంఎల్, అలాకాకుంటే 5 పిపిఎం ప్రకారమైతే లీటర్ నీటిలో 5 ఎంఎల్ వేపనూనె వేసుకుని పిచికారీ చేయాలి. రెండవ దశలో యాజమాన్య పద్ధతి పాటించడం చేయాలి. కందిచెట్లను అల్లాడించి పురుగును రాలిపోయేలా చేయాలి. మూడోదశలో క్లోరిఫైరిఫాస్ మందును లీటర్ నీటిలో 2ఎంఎల్ లేదా క్వినాయిల్‌ఫాస్ మందును లీటర్ నీటిలో 2ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి. రోగార్ మందును కూడా లీటర్ నీటిలో 2 ఎంఎల్ కలిపి స్ప్రేచేయాలి. అప్పటికీ పురుగు కంట్రోల్ కాకపోతే నాల్గవదశలో స్పెనోషాడ్ మందును లీటర్ నీటిలో 4ఎంఎల్ లేదా హాస్పేట్ మందును లీటర్ నీటిలో 5గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి.

-యల్లప్ప, ఎడిఎ కళ్యాణదుర్గం

విద్యుత్ శాఖలో లంచావతారాలు..?

ప్రతి పనికీ ఓరేటు ఇవ్వాల్సిందే..- ఇదీ ఆత్మకూరులో పరిస్థితి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని విద్యుత్ శాఖ అధికారులు లంచవతారమెత్తి రైతులను జలగల్లా పీక్కుతింటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పనికీ ఓరేటు కుదుర్చి వసూలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇందుకు కాంట్రాక్టర్లను వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అడిగినంత ఇవ్వకపోతే విద్యుత్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిప్పుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఆత్మకూరు మండలంలోని సనప, వడ్డుపల్లి, గొరిదిండ్లలో విధ్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అన్ని సబ్‌స్టేషన్లకు ఒక మండల అసిస్టెంట్ ఇంజినీర్ ఉండడంతో సిబ్బంది, అధికారులు 'ఆడిందే ఆట, పాడిందే పాట'గా తయారై పైసలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. చేసేదిలేక రైతులు వారు చెప్పినంత ముట్టజెబుతూ పనులు చేయించుకోవాల్సి వస్తోందన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే దాన్నిస్థానంలో వేరే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలంటే అదనంగా రూ.10వేల నుంచి రూ.15వేల వరకూ విద్యుత్ ఉద్యోగ సిబ్బందికి ఇవ్వాల్సిందేనని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ నూతన ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలంటే అంతకు రెట్టింపు అదనంగా ఇవ్వాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఓ రైతు ఏర్పాటు చేసుకున్న కోళ్ల పెంపకం షెడ్డుకు నేరుగా త్రీ ఫేస్ కనెక్షన్ ఇవ్వడం విద్యుత్ అధికారుల అవినీతికి సాక్ష్యం అని మండల వాసులు అంటున్నారు. అలాగే నూతనంగా నిర్మించుకున్న ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం కనీసం రూ.5 నుంచి రూ.10 వేల వరకూ డబ్బులు అడుగుతున్నట్లు సమాచారం. ఇక పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే రూ.25 వేల నుంచి రూ.30వేల వరకూ రేటు కుదుర్చుకుని పనులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పొలాల్లో విద్యుత్ కనెక్షన్ కోసం అప్లికేషన్ పెట్టుకున్న నాటి నుంచి విద్యుత్ మెటీరియల్ సరఫరా, కరెంటు తీగలు లాగేంత వరకు మామూళ్లు ఇవాల్సిందేనని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ లైన్ మార్చాలన్నా, స్తంభాలు మార్పు చేయాలన్నా ప్రతి పనికీ ఓరేటు కుదుర్చుకుంటున్నారని సమాచారం. పొలాల్లో విద్యుత్ సరఫరా ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎవరకు ఎక్కువగా చెల్లిస్తే, వారికే మొదట కనెక్షన్ ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో విద్యుత్ శాఖ కొనసాగిస్తున్న లంచావతారాలపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

'అశ్వర్థం' అభివృద్ధికి కృషి

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



అశ్వర్థంలో పూజలు చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి క్షేత్రం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం సమీపంలోని అశ్వర్థ నారాయణ స్వామి, భవానీ భీమలింగేశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో కలియతిరిగారు. ముఖ్యంగా అనంతపురం నుంచి బస్సులను ఏర్పాటు చేసి అశ్వర్థ నారాయణస్వామి, నరసింహస్వామి, తాడిపత్రి చింతల వెంకటరమణ ఆలయాలు, ఆలూరు కోన వంటి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపి టూరిస్టుగా అభివృద్ధి పథకంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రవీంద్రారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలో దుష్టుల పాలన సాగుతోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో మండల కార్యదర్శి గువ్వల శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లిక్కర్ దుకాణాలను ప్రయివేటీకరణ చేసి తమ అనుకూల కూటమి నాయకులకు కట్టబెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వ ధనాన్ని తమ అనుకూల నాయకులకు దోచిపెట్టడంలో చంద్రబాబు మోడల్ కొత్తేమీ కాదని విమర్శించారు. తంబళ్లపల్లిలో రోజూ 20 నుంచి 30 వేల అక్రమ మద్యం బాటిల్స్ తయారవుతోందని, దీనిపై సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి అక్రమ మద్యం తయారు చేయడం మందుబాబులకు తీవ్ర అన్యాయం చేస్తున్నట్టేనని వ్యాఖ్యానించారు. అక్రమ మద్యం తయారీ అంటే స్కామ్‌లకే స్కామ్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం చంద్రబాబుదే అన్నారు. ఈ అక్రమాల సూత్రధారులు, పాత్రధారులు కూటమి నాయకులేనని ఆరోపించారు. పేదలు, దళితుల పట్ల చంద్రబాబుకు ఎప్పుడూ ఆలోచన ఉండదని విమర్శించారు. ప్రజలకు చేసే పని తక్కువ-ప్రచార ఆర్భాటాలు ఎక్కువ అని అన్నారు. క్వర్ స్కామ్‌లో సంబంధం లేని జగన్‌పై ఆరోపణలు చేయడం పూర్తిగా తప్పు అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, ఎంపిటిసి కాలవ వెంకటలక్ష్మి, వెంకట శివారెడ్డి, పసునూరు భయపరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు వరకూటి కాటమయ్య, వడియంపేట అంజి, వైసిపి యువజన నాయకులు పూల రంగనాథ్, గాంధీనగర్ ఆదినారాయణ, కాలవ నారాయణస్వామి, పూల నారాయణస్వామి, ముత్యాల శీన, పురుషోత్తం, కొత్తపల్లి భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన ఎస్పీ

పజాశక్తి-అనంతపురం

జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని దర్గాను ఎస్పీ జగదీష్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఉందన్నారు. పోలీసుల కుటుంబాలు సోదరభావంతో మెలగాలని ఆదర్శభావంగా నిలవాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ఇక్కడ అన్నిమతాలు ఒక్కటే అన్నారు. అన్నిమతాల పర్వదినాలు ప్రాధాన్యతగా భావించి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని మహబూబ్ సుబహాని దర్గాలో ఘనంగా గ్యార్మీ వేడుకల్లో ఎస్పీ పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు ఇక్కడ ఉన్నాయని, ఆయా పర్వదినాలు జిల్లా పోలీసుశాఖ ఘనంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇక్కడ అన్ని మతాల వారు ఒక్కటేననే భావనతో ఉంటున్నారన్నారు. అందరూ కలిసిమెలిసి నిమగ్నం కావడం, భోజనం చేయడం శుభ పరిణామమన్నారు. ఈకార్యక్రమంలో తాడిపత్రి ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు వెంకటేశులు, రవిబాబు, శ్రీనివాస్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, ఆర్ఎస్ఐ జాఫర్, గాండ్ల హరినాథ్, సరోజ, దర్గా కమిటీ సభ్యులు మసూద్‌వలి, షేక్షావలి, నాగరాజు, ఖాదర్‌వలి, లింగమయ్య, బాబా ఫకృద్ధీన్, దౌలా, రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కళాకారునికి సన్మానం

నార్పల : ప్రపంచ స్థాయి అవార్డు సాధించిన చిత్ర కళాకారుడు నార్పలకు చెందిన చిన్న కుళ్లాయప్పను ఆదివారం మండల కేంద్రంలో పలువురు అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప మాట్లాడుతూ ఈజిప్ట్‌కి చెందిన అబ్లా ఫాండేషన్ ప్రపంచ వ్యాప్తంగా వ్యంగచిత్రాల పోటీ నిర్వహించగా ఇందులో భారతదేశం తరపున నార్పలకు చెందిన చిన్నకుళ్లాయప్ప చిత్రగీతం ప్రపంచ ద్వితీయ బహుమతి సాధించడం గర్వకారణమన్నారు. మన భరతజాతి కీర్తి కిరీటాన్ని ప్రపంచ పటంలో ఇనుమడింపజేయటమే కాక రాష్ట్రానికి కూడా తగిన గుర్తింపు తెచ్చిందన్నారు. ఇలాంటి అవార్డు గ్రహీతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి వారికి సముచిత ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు వెంకట రాముడు, తిరుపాల్, మల్లికార్జున, రమేష్, రాజేష్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల ఇకెవైసి పరిశీలన

పుట్లూరు : మండలంలోని కడవకల్లు, సూరేపల్లి పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ కూలీల ఇకెవైసిని పీడీ సలీంబాషా ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా వివరాలను స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఎపిడి పుల్లారెడ్డి, ఎపిఒ తులసీప్రసాద్, ఇసి అంజన్‌కుమార్, సాంకేతిక సహాయకులు శంకర్, క్షేత్ర సహాయకులు కడవకల్లు శివ, సూరేపల్లి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి, చింతకాయమంద గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ కూలీల ఇకెవైసిని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సలీంబాషా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ తప్పనిసరిగా ఫొటోతో ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి పుల్లారెడ్డి, ఎపిఒ ఓబిరెడ్డి, ఇసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఉపకరణాల ఎంపిక క్యాంపు

యల్లనూరు : 18ఏళ్లలోపు వికలత్వం ఉన్న వారికి సమగ్ర శిక్ష అలిమ్కో వారి ఆధ్వర్యంలో నేడు తాడిపత్రిలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఉచిత ఉపకరణాల ఎంపిక మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వికలత్వం(దివ్యాంగుల) ఉపకరణాల కోసం వికలత్వ ధ్రువీకరణ పత్రం సదరన్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, పాస్‌ఫొటో, రేషన్‌కార్డుతో వచ్చి నమోదు చేసుకోవాలని కోరారు.

మొగిలి అంకారావుకు ఉత్తమ అధ్యాపక అవార్డు

అనంతపురం : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అనంతపురం జెఎన్‌టియు విశ్వ విద్యాలయం పరీక్షలు విభాగంలో అడిషనల్ కంట్రోలర్ పని చేస్తున్న డాక్టర్ మొగిలి అంకారావు అంతర్జాతీయ, జాతీయ ఎక్స్‌లెన్స్ కంపెనీ వారు ఇంటర్ నేషనల్ బెస్ట్ ఇన్పిరేషనల్ టీచర్ అవార్డు-2025ను అందుకున్నారు. ఈ సందర్భంగా అంకారావు మొగిలి మాట్లాడుతూ ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న ప్రోత్సాహం వల్లే అవార్డు వచ్చిందన్నారు. అవార్డు డాక్టర్ అంకారావుకు వచ్చినందుకు ఉపకులపతి, రిజిస్ట్రార్, ఒఎస్‌డి వీసీ, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు జిల్లాస్థాయి ఈత పోటీలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురము ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఈత పోటీలు ధరూర్ స్విమ్మింగ్ అకాడమీ ఈత కొలనులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి అనంతపురము జిల్లాల నుంచి దివ్యాంగ క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో ఫ్రీ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, బట్టర్ ఫ్లై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు బాలాజీ, చిన్న, రిషి రెడ్డి, శ్రీనివాస్, నాగేష్, మోహన్ కష్ణ ఉన్నారు. వీరందరూ ఈ నెల 12వ తేదిన ఏలూరులో జరుగబోయే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ధరూర్ స్విమ్మింగ్ అకాడమీ నాయుడు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు శివప్ప, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అనంతపురం ఆర్‌డిటి స్టేడియంలో జర్నలిస్టుల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జెఎస్ఏఏపి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ఆదివారం ప్రారంభమైంది. ముందుగా మంత్రి, ఎమ్మెల్యేలు కాసేపు బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో ఎంతో ప్రధాన పాత్ర వహిస్తాయని, అవి కేవలం శారీరక దఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి కూడా దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్ కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, చిత్తూరు జిల్లా ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జెఎస్ఏఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, గౌరవాధ్యక్షులు రేపటి రామాంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం

భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాష్ట్రంలో అధికారంలోకి కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులను మోసం చేసిందని సిఐటియు అనుబంధ భగత్‌సింగ్ ఆటో యూనియన్ జిల్లా నాయకులు సాకే నాగరాజు విమర్శించారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమం ద్వారా రూ.15వేలు ఆర్థికసాయం అందించడం స్వాగతిస్తున్నామన్నారు. అయితే నియోజవర్గంలో 8 వేల మంది పైగా ఆటో కార్మికులు ఉండగా కేవలం 1747 మంది ఆటో కార్మికులకే ఈ పథకం వర్తింపజేసి కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నియోజకవర్గంలో ఆటో డ్రైవర్లు 8వేలకుపైగా ఉండగా ప్రభుత్వం గుంతకల్లులో 567 మందికి, మండల పరిధిలో 398, గుత్తి పట్టణంలో 280, మండలంలో 258, పామిడి మండలంలో 254 మంది కార్మికులు మాత్రమే వర్తింపజేయడం బాధాకరమన్నారు. ఈ పథకానికి అనేక షరతులు పెట్టి అనేక మంది ఆటో డ్రైవర్లను అనర్హులు తేల్చి అందరికీ ఇచ్చామని మోసం చేస్తోందన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్‌కీ అమలు చేయాలని, సెకండ్ పార్టీ ఆటో ఓనర్‌కు అగ్రిమెంట్ పేపర్లతోనే ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వాడకం రద్దు చేయాలన్నారు. ఈ చలానాలు పెండింగ్‌లో ఉన్నా ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో కార్మికులు, క్యాబ్ డ్రైవర్లను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ ఎస్‌కె బాషా, తిమ్మప్ప, లోకు, రాజు, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్ : నేడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమాన్ని ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు సమస్యలపై అర్జీ ఇచ్చి పరిష్కరించుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

'అనంత వస్త్రాలయం'లో పండుగ సంబరాలు

రోజూ ఓ పట్టు చీర బహుమతి-మేనేజింగ్ డైరెక్టర్ కట్టా సుబ్రమణ్యం, హారిక

ప్రజాశక్తి-అనంతపురం



అనంత వస్త్రాలయ పట్టుచీరల దుకాణం (ఇన్‌సెట్‌లో) సుబ్రమణ్యం

నగరంలోని జీసస్ నగర్‌లో ఉన్న అనంత వస్త్రాలయంలో కస్టమర్ల సౌకర్యార్థం దసరా, దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కట్టా సుబ్రమణ్యం, హారిక తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగల సందర్భంగా తమ షోరూమ్‌లో కస్టమర్ల సౌకర్యార్థం 25 శాతం తగ్గింపు ధరల్లో పట్టుచీరలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దసరా తర్వాత దీపావళి పండుగ నేపథ్యంలో రోజూ కస్టమర్లకు దీపావళి డబల్ ధమాకా అందిస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థ ప్రమోషన్‌ను లైక్‌షేర్ కామెంట్ ద్వారా కస్టమర్లు అందించే ప్రమోషన్‌కు రోజూ ఓ పట్టుచీరను బహుమతిగా అందిస్తున్నట్లు చెప్పారు. కస్టమర్ల ద్వారా వచ్చే ప్రమోషన్ స్క్రీన్ షాట్లను ఎంపిక చేసి దీపావళి వరకూ రోజూ ఓ పట్టు చీరను అందించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రతి రూ.వెయ్యి కొనుగోలుపై ఆకర్షణీయమైన బహుమతిని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అనంత అతివలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పోటీలను ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి

విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు చాలా అవసరమని విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని నాయక్ నగర్ లోని స్మాష్ బ్యాడ్మింటన్ అకాడమీలో అండర్-17 బాల, బాలికలకు బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అకాడమీ, శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను విప్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. బాలికలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాప్ గతం కన్నా ఇప్పుడు బాగా పని చేస్తోందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో బాగా రాణించి.. అనంతపురం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ అధ్యక్షుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోణంకి గంగారం, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాయదుర్గం నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా విశ్రాంత తహశీల్దార్ గురు రాజప్రసాద్ వ్యవహరించారు. అధ్యక్షులుగా ఇ.రామాంజనేయులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వై.ముత్యాలరెడ్డి, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణరెడ్డి, గోవిందరా జులు, వీరభద్రయ్య, శాంతిరాజ్, ప్రధాన కార్యదర్శిగా జి.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ బారి, గోపాలకృష్ణ, సంజీవరెడ్డి, సిద్ధప్ప, కోశాధికారిగా కె.నాగరాజుశెట్టి, కార్యవర్గ సభ్యులుగా 13 మంది ఎన్నికయ్యారు.